ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 జయశంకర్ భూపాలపల్లి

ఆదివారం 2 మార్చి 2025

కన్నీటి కష్టం..



స్టేషన్‌ఘనపూర్‌లో ఎండిన మొక్కజొన్నను చూపుతున్న రైతు వెంకటయ్య

ఆశల తడి ఆవిరి!

ఉమ్మడి జిల్లాలో తీవ్రమవుతున్న సాగునీటి కొరత

- ఎండుతున్న యాసంగి పంటలు
- ప్రభుత్వం కేటాయించిన పద్ధతిలో ప్రాజెక్టుల నుంచి అందని నీరు
- దేవాదుల, ఎస్సారెస్పీ ఫేజ్-2 ఆయకట్టు రైతులకు నీటి కష్టాలు
- చెరువులు, కుంటలు, వాగుల పరిధిలోనూ అదే పరిస్థితి
- పశువులకు మేతగా మారుతున్న వరి, మొక్కజొన్న
- సాగునీటి కోసం రోడ్డెక్కుతున్న అన్నదాతలు
- ఉమ్మడి జిల్లాలో 9,26,459 ఎకరాల్లో పంటల సాగు
- అత్యధికంగా 6.61లక్షల ఎకరాలకు పైగా సాగయిన వరి

7

అన్నదాతల ఆశలు ఆవిరవుతున్నాయి. ఎన్నో ఆశలతో సాగుచేసిన యాసంగి పంటలు చివరి తడి అందక ఎండుతున్నాయి. కళ్లెదుటే తమ ఆశల సాగు ధ్వంసమవుతుండటాన్ని చూస్తున్న రైతుల కళ్లు చెమ్మగిల్లుతున్నాయి. సాగునీరిచ్చి పంటలను కాపాడాలని ఆ కర్షకుల కాళ్లు ఆందోళనల బాట పడుతున్నాయి. తమను ఆదుకునే వారే లేరా అటూ ఆ గొంతులు నినదిస్తున్నాయి. చెరువులు, కుంటలు, వాగులు, బోర్లలో నీళ్లు అడగంటుతుండగా.. ఉమ్మడి జిల్లా రైతులకు వరప్రదాయినిగా భావించే దేవాదుల, ఎస్సారెస్పీ కాల్వల నుంచి ఆశించిన స్థాయిలో నీరందక ఆయకట్టు భూములు బీటలు వారుతున్నాయి.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

ఎండిన వరి.. ఎడ్లకు మేతగా..

భూపాలపల్లి మండలంలోని కొంపెల్లి గ్రామానికి చెందిన దాసరి వెంకన్న అనే రైతు అదేగ్రామంలో చెరువు కింద ఉన్న రెండెకరాల్లో మిర్చి.. అర ఎకరంలో వరి పంట వేశాడు. కానీ కొద్దిరోజులుగా చెరువులో నీరు తగ్గడంతో సాగునీరు సక్రమంగా అందకపోవడంతో వరి పూర్తిగా ఎండిపోయింది. దీంతో ఆవేదన చెందిన ఆ రైతు శనివారం ఇదిగో ఇలా తన ఎడ్లకు మేతగా వదిలేశాడు. ఇక రెండెకరాల్లో వేసిన మిర్చి పంట కూడా చివర దశలో ఉందని, దానికి కూడా సక్రమంగా తడులు అందక ఎండిపోయే పరిస్థితి వచ్చిందని వెంకన్న ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.





వరి పొలంలో మేస్తున్న ఎద్దులు



సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మెల్యేలు, ఎంపీలు

సీఎం సార్.. థాంక్యూ

- రేవంత్‌ను కలిసిన ఓరుగల్లు ఎమ్మెల్యేలు, ఎంపీలు
- ఎయిర్‌పోర్టుకు గ్రీన్‌సిగ్నల్.. కృతజ్ఞతలు తెలిపిన నేతలు
- బడ్జెట్‌లో నగరాభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించాలని విజ్ఞప్తి

వరంగల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వరంగల్ ఎయిర్‌పోర్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చేలా కృషి చేసినందుకు గాను సీఎం రేవంత్‌రెడ్డికి ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో రేవంత్‌ను వరంగల్ పశ్చిమ, స్టేషన్‌ఘనపూర్, వర్ధన్నపేట, పరకాల ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, నాగరాజు, మురళీనాయక్ వరంగల్, మహబూబాబాద్ ఎంపీలు డాక్టర్ కడియం కావ్య, బలరాంనాయక్ తదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు. వరంగల్‌కు ఎయిర్‌పోర్టు మంజూరు చేయించేందుకు కృషి చేసిన రేవంత్‌రెడ్డికి ధన్యావాదాలు తెలిపారు. వరంగల్ ప్రజల ఆకాంక్ష నెరవేర్చారని, వరంగల్‌ను రెండో రాజధానిగా అభివృద్ధి చేసేందుకు చూపిస్తున్న చొరవ చూపుతున్నారని వారు సీఎం వద్ద ప్రస్తావించారు. అలాగే ఈ నెలలో ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌లో వరంగల్ అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీకి మొదటి విడతలో రూ.2వేల కోట్ల నిధులు కేటాయించాలని, అలా ఇతర అభివృద్ధి పనులకు కూడా మరిన్ని నిధులు ఇవ్వాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సీఎంను కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నేత సాంబయ్య పాల్గొన్నారు.



కేరింతలు కొడుతున్న విద్యార్థులు

పాటలతో అలరిస్తున్న గీతామాధురి

హుషారెత్తించారు..

- రెండవ రోజు సందడిగా వసంతోత్సవం
- లలిత కళల సమాహారంగా సాగిన ఈవెంట్లు
- పలు ఈవెంట్లలో పోటాపోటీగా పాల్గొన్న విద్యార్థులు
- మినీ భారతాన్ని తలపించిన నిట్ క్యాంపస్
- విద్యార్థులను ఉత్సాహపరిచిన కార్యక్రమాలు

వివరాలు 7వ పేజీలో



గింజలు లేని కంకిని చూపిస్తున్న రైతు

కొంప ముంచిన మొక్కజొన్న

- గింజలు పోయని కంకులు
- వెయ్యికరాలలో నష్టం
- మూడు కంపెనీల నుంచి రైతులకు విత్తనాలు
- ఒప్పందం లేకుండానే సాగు
- నష్టపరిహారం చెల్లింపుపై సందిగ్ధం
- జిల్లా కలెక్టర్ జోక్యంతో అధికారుల సర్వే

ములుగు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): వ్యవసాయం జూదమైంది.. అతివృష్టి, అనావృష్టి ప్రభావం, చీడ పీడలతో ఏటా ఎందరో అన్నదాతలు నిండా మునుగుతున్నారు. వీటన్నిటికంటే నకిలీ విత్తనాలతో సంభవించే నష్టం అపారమైంది. వీటిని అధిగమిస్తూనే రైతులు సాగుబాటలో ముందుకు సాగుతున్నారు. ఈనేపథ్యంలో ములుగు జిల్లాలో వెయ్యికరాలలో సాగుచేసిన మొక్కజొన్న పంట గింజలు పోయక రైతులు తీవ్రంగా నష్టపోయారు. మూడు బహుళజాతి కంపెనీలతో ఒప్పంద సాగులో భాగంగా జొన్న పంటను సాగుచేయగా పరిహారం చెల్లింపులో సందిగ్ధత నెలకొంది. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర జోక్యం చేసుకోవడంతో వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వేచేసి నివేదిక రూపొందిస్తున్నారు. ములుగు జిల్లాలోని గోదావరి పరివాహకంలోని కన్నాయిగూడెం, మంగపేట, ఏటూరునాగారం, వెంకటాపురం, వాజేడు మండలాలో సారవంతమైన భూములున్నాయి. మేలురకం విత్తనాలను ఉత్పత్తిచేసే క్రమంలో పలు కంపెనీలు ఇక్కడి రైతులతో ఒప్పందం చేసుకొని గత కొన్నేళ్లుగా మిర్చి, మొక్కజొన్న, వరి పంటలను సాగు చేస్తున్నాయి. విత్తనాలు సదరు కంపెనీయే రైతుకు అందజేస్తుంది. పురుగుమందులు, ఎరువులు అందజేయడంతోపాటు కూలీ ఖర్చులు కూడా భరిస్తుంది. కోత తర్వాత పంటను తీసుకొని అగ్రిమెంటు ప్రకారం రేటు చెల్లిస్తుంది. ఈ తరహాలోనే ఈసారి కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం మండలాలలో సింజెంటా, బేయర్, హైటెక్ కంపెనీలు సుమారు 1030ఎకరాలలో మొక్కజొన్న సాగుకోసం రైతులతో పరస్పర ఒప్పందం చేసుకుంది. కానీ, విత్తనాలలో జన్యుపరమైన సమస్యలు తలెత్తడంతో ఆశించిన స్థాయిలో గింజలు రాలేదు.

అగ్రిమెంటు లేకుండానే..

సాధారణంగా కంపెనీలు పంట వేయడానికి ముందే రైతులతో ఒప్పందం చేసుకుంటుంది. క్వింటాచొప్పున రేటును నిర్ణయిస్తుంది. పర్యవేక్షణ కోసం ఏరియాకో ఆర్గనైజర్‌ను నియమించుకుంటుంది. ఇదంతా విత్తన చట్టం పరిధిలోకి రాకుండానే ప్రయివేటుగానే జరుగుతుంది. ఈసారి కూడా మూడు కంపెనీలు రైతులకు మొక్కజొన్న విత్తనాలు ఇచ్చింది. అనూహ్యంగా పంట ఫెయిల్ కావడంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. నిర్దిష్టమైన పద్ధతిలో అగ్రిమెంటు చేసుకోకపోవడంతో సర్వత్రా ఆందోళన నెలకొంది.



పరిహారం చెల్లింపు ప్రశ్నార్థకం

వాజేడు, వెంకటాపురం, కన్నాయిగూడెం మండలాలు 1/70చట్టం పరిధిలోకి వస్తాయి. ఇక్కడ గిరిజనేతరులకు భూములపై ఎలాంటి హక్కులు ఉండవు. మొక్కజొన్న పంట సాగు చేసి నష్టపోయిన వారిలో ఎక్కువ మంది వారే ఉన్నారు. క్వింటా మొక్కజొన్నకు రూ.3600లు చెల్లించే విధంగా కంపెనీ ప్రతినిధులు రైతులతో మాట్లాడుకున్నారు. విత్తనాలు ఫెయిల్ కావడంతో 10శాతం కూడా పంట చేతికివచ్చే పరిస్థితి లేదు. ఈ క్రమంలో రైతులకు

మిగతా 8వ పేజీలో...

నెలవంక కనిపించె..

7

నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు షురూ

SBI

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్ట్రెస్డ్ అసెట్స్ రికవరీ శాఖ (కోడ్:05172)

2వ అంతస్తు, టీఎస్ఆర్టీసీ కంమ్యూటర్ అమేనిటీ సెంటర్, బస్ టర్మినల్ కాంప్లెక్స్, కోఠి, హైదరాబాద్-500095. తెలంగాణ

ఇ-మెయిల్ : sbi.05172@sbi.co.in

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8 (6) క్రింద)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6) నిబంధనతో చదవబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టబడిన/ చార్జ్ చేయబడినట్టి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారి ద్వారా **వాస్తవిక స్వాధీనం** చేసుకోబడినట్టి, దిగువ వివరించిన స్థిరాస్తులను **రుణగ్రహీతలు: శ్రీ దొమ్మటి సాయి కృష్ణ, తండ్రి దొమ్మటి సాంబయ్య,** ఇ.నం.3-47, మల్లక్కపేట (గ్రా), పరకాల మండలం, వరంగల్ జిల్లా-506164, **మరియు** (ఎ) ఇ.నం.2-6-1007, కెఎల్ఎన్ రెడ్డి కాలనీ, సుబేదారి, హనుమకొండ, వరంగల్-506001 **మరియు** (బి) ఇ.నం.2-8-656, ఫ్లాట్ నం.403, కామాక్షి టవర్స్, ఎక్సైజ్ కాలనీ, హనుమకొండ, వరంగల్-506002, **శ్రీ దొమ్మటి సాంబయ్య (POA గ్రహీత), తండ్రి నర్సయ్య,** ఇ.నం.2-6-1007, కెఎల్ఎన్ రెడ్డి కాలనీ, సుబేదారి, హనుమకొండ, వరంగల్-506001 **మరియు** ఇ.నం.2-8-656, ఫ్లాట్ నం.403, కామాక్షి టవర్స్, ఎక్సైజ్ కాలనీ, హనుమకొండ, వరంగల్-506002ల నుండి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు రావలసిన బకాయి కాంట్రాక్చువల్ రేట్ వంతున తదుపరి వడ్డీ, వ్యయాలతో పాటు **01.03.2025** నాటికి **రూ.51,69,005/-** (రూపాయలు యాభై ఒక్క లక్షల అరవై తొమ్మిది వేల ఐదు మాత్రమే) రాబట్టుకొనుటకు **25.03.2025**న **"ఎక్కడ ఎలా ఉన్నదో అక్కడ అలా, " అక్కడ ఏమి ఉన్నదో అది" మరియు "ఏది ఎక్కడ ఉంటే అది"** ప్రాతిపదికన విక్రయించబడునని ముఖ్యంగా రుణగ్రహీతలు మరియు హామీదారులు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా ప్రకటన ఇవ్వడమైనది.

రిజర్వ్ ధర రూ.34,50,000/- (రూపాయలు ముప్పైనాలుగు లక్షల యాభై వేలు మాత్రమే) **మరియు బయానా రూ.3,45,000/-** (రూపాయలు మూడు లక్షల నలభై ఐదు వేలు మాత్రమే)

ఏదైనా తెలిసిన తాకట్టు రుణభారాలతో స్థిరాస్తి సంక్షిప్త వివరణ

వరంగల్ (అర్బన్) జాయింట్ సబ్ రిజిస్ట్రార్ అధికార పరిధిలో **దొమ్మటి సాయికృష్ణ** పేరునగల నమోదిత విక్రయ దస్తావేజు నం.19346/2018, తేది:01.09.2018 ప్రకారం రిజిస్ట్రేషన్ జిల్లా పరిధిలో మరియు **వరంగల్ మహానగర పాలక సంస్థ** విస్తరించిన పరిధిలో లష్కర్ సింగారం రెవెన్యూ గ్రామం (ఆర్.వి), సర్వే నం.316లో మొత్తం **161.82 చ.గజాలలో** కామన్ ఏరియా 16.18 చ.గజాలు కలుపుకొని **145.64 చ.గజాలు (లేదా) 121.76 చ.మీటర్ల** విస్తీర్ణ ఖాళీ ప్లాట్ (భాగం) యావత్తు. **సరిహద్దులు: తూర్పు:** డి. విమలాకుమారి ఖాళీ ప్లాట్ (భాగం), **పశ్చిమం:** 80 అ.రోడ్, **ఉత్తరం:** 5అ.ఉమ్మడి లేన్, రాంచందర్ రెడ్డి ప్లాట్, **దక్షిణం:** శ్రీ సాయిరాంరెడ్డి ప్లాట్. నమోదిత విక్రయ దస్తావేజు డాక్యుమెంట్ నం.19346/18, తేది:10.09.2018, ఇ.నం.2-1-743/1కు సమీపాన సదరు ప్లాట్ గలదు.

కో ఆర్డినేట్స్: 17.94019, 79.58450 (ప్రదేశం తెలుసుకొనుటకు గూగుల్ మ్యాప్‌లో ఇది టైప్ చేయగలరు)

సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తెలిసిన తాకట్టు రుణభారాలు : లేవు

రిజర్వు ధర : రూ.34,50,000/-, బయానా: రూ.3,45,000/-, బిడ్ పెరుగుదల మొత్తం: రూ.25,000/-

వేలం తేది: 25.03.2025, వేలం సమయం : మ.12.00గం.లనుండి మ.3.00గం. వరకు.

ఆస్తి ఐడి: SBIN00005118683

గమనిక : అన్ని వర్తించు పన్నులు, విద్యుత్ బిల్లులు, స్టాంపు డ్యూటీలు, రిజిస్ట్రేషన్ చార్జీలు, ఫీజులు, వగైరాలను విజయవంతమైన బిడ్డర్ భరించవలెను.

1. పై ఆస్తి యొక్క ఇ-వేలంలో పాల్గొనదానికి వేలం తేదికి ముందర బ్రౌజర్‌పై వెబ్ పోర్టల్ : URL: https://baanknet.com లో తమకుతాము నమోదు చేసుకోవాలని కాగోరు బిడ్డర్లు అందరిని అభ్యర్థించడమైనది.
2. ఆసక్తిగల బిడ్డర్లు లాగిన్ ఐడి మరియు పాస్‌వర్డ్‌లను క్రియేట్ చేయడం, డేటాను అప్‌లోడ్ చేయడం, బిడ్ డాక్యుమెంట్లను దాఖలు చేయడం, శిక్షణ/ప్రదర్శన, నియమనిబంధనలు, ఆన్‌లైన్ ఇంటర్ బిడ్డింగ్ వగైరా సహాయం కొరకు వెబ్‌సైట్ https://baanknet.com దర్శించగలరు.
3. అమ్మకం యొక్క సవివర నియమనిబంధనల కొరకు వెబ్‌సైట్ URL: https://baanknet.com ను చదవగలరు. **తదుపరి వివరాల కొరకు ముందస్తు అనుమతితో 24.03.2025న సా.5.00గం.లలోపు ఏదైనా పని దినమున దిగువ అధికారులను సంప్రదించగలరు. 1) శ్రీ సందీప్ పరిదాల, మేనేజర్, మొబైల్ నం. 8985903747, 2) శ్రీ గంజి ప్రసాద్, చీఫ్ మేనేజర్, మొబైల్ నం.9866986725.**

తేది:01.03.2025, ప్రదేశం: హైదరాబాద్ నం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,SARB-1 Hyd

ప్రతీ విద్యార్థి లక్ష్యసాధన దిశగా కృషి చేయాలి

ములుగు కలెక్టరేట్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థి లక్ష్యాలను ఏర్పరచుకుని లక్ష్య సాధన దిశగా కృషి చేస్తూ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిగమించి సమాజ అభివృద్ధి కోసం తోడ్పడాలని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా విద్యాశాఖ సమన్వయంతో జిల్లాలోని ఆరు మండలాల్లోని 20 పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న బాలబాలికలకు కెరీర్ ఫెయిర్ జరిగింది. కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశలో పదవ తరగతి కీలకమని, జీవితంలో ఎదగాలంటే కమిట్‌మెంట్, కాన్ఫిడెన్స్, ఫ్లెక్సీబుల్టీ విషయాలను దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగితే ఏదైనా సాధించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌ఫాం స్కూల్స్ నేహారానా, ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆ ఘనత మాదే.. కాదు మాదే..

- మామునూరు ఎయిర్ పోర్ట్ విషయంలో గలాటా
- ప్రతిపాదిత స్థలం వద్ద కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీ సంబురాలు
- కార్యకర్తల మధ్య తోపులాట.. స్వల్ప ఉద్రిక్తత


మామునూరు వద్ద ఘర్షణ పడుతున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులు

మామునూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లాలోని మామునూరు ఎయిర్‌పోర్ట్ వద్ద శనివారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మామునూరు ఎయిర్ పోర్ట్ తీసుకొచ్చింది మాపార్టీ అంటే.. కాదు మా పార్టే అంటూ బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు పోటాపోటీ నినాదాలు చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారి తీసింది. ఇరువర్గాల మధ్య తోపులాట జరగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. మామునూరు విమానాశ్రయ పనులకు కేంద్రం అనుమతి ఇవ్వడంతో ప్రధాని మోదీ చిత్రపటానికి పుష్పాభిషేకం చేసేందుకు ముందుగా బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంటా రవి కుమార్ కార్యకర్తలతో కలిసి అక్కడకు వచ్చారు. అదే సమయంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు కూడా రావడంతో విమానాశ్రయం సాధించిన ఘనత తమదే అంటే.. కాదు తమదే అంటూ ఇరుపక్షాల నాయకులు వాదోపవాదాలకు దిగారు. దీంతో కొంతసేపు తోపులాట జరిగి అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న మామునూరు సీఐ రమేష్, ఎస్ఐ శ్రీకాంత్ తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలను పంపించి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. మరోసారి ఘర్షణలు జరుగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

కాటారం రేంజ్ అడవుల్లోనే పెద్దపులి!

- జాడ కోసం గాలిస్తున్న అటవీశాఖ అధికారులు
- శాశ్వత ఆవాసం కోసమే పులి అడవులను కలియదిరుగుతున్నట్లు అనుమానాలు


అడవుల్లో గాలింపు చర్యల్లో అటవీశాఖ అధికారులు

కాటారం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : కాటారం రేంజ్ అడవుల్లోనే పెద్దపులి సంచరిస్తున్నది. శనివారం ప్రతాపగిరి అడవుల్లోని పులి తోగు వాగు నుంచి పలుచోట్ల పగ్‌మార్క్స్ (పెద్దపులి పాదముద్రలు) ఆనవాళ్లు కనిపించడంతో అటవీశాఖ అధికారులు రేంజ్ అడవుల్లోనే పులి సంచరిస్తున్నట్లు తేల్చారు. శుక్రవారం రాత్రి పెళ్లికి వెళ్తున్న వారు పులి జాతీయ రహదారిని దాటుతూ కాటారం అడవుల్లోకి వెళ్తుండగా చూసినట్లు ప్రచారం జరిగింది. దీంతో అటవీ శాఖ కాటారం, యామన్‌పల్లి డిప్యూటీ రేంజర్లు సురేందర్, శ్రీనివాస్ నేతృత్వంలో అటవీ అధికారులు, సిబ్బంది అడవులను జల్లెడ పట్టారు. పులి ప్రతాపగిరి అడవులనుంచి మద్రిపల్లి మీదుగా కాటారం, నస్తూరుపల్లి అడవుల వైపుగా వెళ్తున్నట్లు పలు చోట్ల వాగు, బాటల్లో పులి పాదముద్రలు(పగ్‌మార్క్స్) కనిపించాయి. అడవుల చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, ఇతరులు అడవుల్లోకి వెళ్లవద్దని అటవీ అధికారులు హెచ్చరిస్తున్నారు. గత 20 రోజులుగా పులి డివిజన్ అడవుల్లో 20 కిలోమీటర్ల రేడియస్‌లో అటు ఇటు సంచరిస్తుండటంపై పలువురు పలు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. పెద్దపులి శాశ్వత ఆవాసం కోసం డివిజన్ అడవులను కలియతిరుగుతుంది కావచ్చని పలువురు అంటున్నారు. పులి సంచారంతో ప్రజలు అడవుల్లోకి వెళ్లవద్దని, పులికి హాని చేసే చర్యలు చేపట్టవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. అడవులను గాలిస్తున్న బృందాల్లో అటవీ అధికారులు రాజేందర్, మొయినొద్దీన్, సంజీవ్, అశోక్, రాజ్‌కుమార్, బేస్ క్యాంప్, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది ఉన్నారు.

ఎస్ఆర్ఎస్పీ కాల్వలో కోళ్ల కళేబరాలు

- బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో కలకలం


కల్వల శివారు ఎస్ఆర్ఎస్పీ కాల్వలో కొట్టుకుపోతున్న కోళ్ల కళేబరాలు

కేసముద్రం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్వల శివారు మోడల్ స్కూల్ సమీపంలో ఎస్ఆర్ఎస్పీ కాల్వ నీటి ప్రవాహంలో శనివారం సాయంత్రం సుమారు వంద కోళ్ల కళేబరాలు కొట్టుకుపోయినట్లు సమీపంలోని రైతులు తెలిపారు. ఎగువ ప్రాంతంలో ప్లాస్టిక్ బస్తాల్లో చనిపోయిన కోళ్లను వేసి కాల్వలో పడేసినట్లు తెలుస్తోంది. అయితే బస్తాల్లోంచి కోళ్ల కళేబరాలు నీటి ప్రవాహంతో బయటకు వచ్చి కొట్టుకుపోతున్నట్లు రైతులు తెలిపారు. నీటి ప్రవాహానికి కోళ్ల కళేబరాలు మహబూబాబాద్ వైపునకు వెళ్లిపోయాయి. చనిపోయిన కోళ్లు నీళ్లలో కొట్టుకుపోతున్న వీడియో స్థానిక సామాజిక మాధ్యమాల్లో పలువురు పోస్టు చేయడంతో చర్చనీయాంశంగా మారింది. బర్డ్‌ఫ్లూ వ్యాప్తి చెందుతున్న నేపథ్యం లో ఎస్ఆర్ఎస్పీ నీటి ప్రవాహంలో కోళ్ల కళేబరాలు కలకలం రేపుతోంది.


దేవాలయం ఆవరణలో కేరళ బృందం

రామప్పను సందర్శించిన కేరళ బృందం


వెంకటాపూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాలంపేట గ్రామంలో గల యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని శనివారం కేరళ రాష్ట్రానికి చెందిన 27మంది యువతీ, యువకులు సందర్శించారు. ఫిబ్రవరి 27 నుంచి మార్చి 3వ తేదీ వరకు ఐదురోజుల పాటు జరుగనున్న ఇంటర్ స్టేట్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలో భాగంగా ప్రపంచ వారసత్వ సంపదలో చోటు దక్కించుకున్న చారిత్రక రామప్ప దేవాలయాన్ని వరంగల్ నెహ్రూ యువకేంద్రం సూపరింటెండెంట్ బానోతు దేవిలాల్ పర్యవేక్షణలో సందర్శించారు. ఈ సందర్భంగా వారు రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ శిల్పకళా వైభవాన్ని తిలకించి తరించిపోయారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా నెహ్రూ యువకేంద్రం ఇన్‌చార్జ్ భాను, ఆర్గనైజర్లు వెల్దండ సురేష్, గాలి భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

పంటకు నిప్పంటించిన దుండగులు


పూర్తిగా కాలిబూడిదైన ఆరబోసిన మిర్చి

భూపాలపల్లి కృష్ణకాలనీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి మండలంలోని దూదేకులపల్లి గ్రామానికి చెందిన రైతుకు సంబంధించిన మిర్చికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. బాధిత రైతు అజ్మీర పరంసింగ్ తెలిపిన వివరాల ప్రకారం... తన కున్న 4 ఎకరాల భూమిలో మిర్చి పండించాడు. ఆ పంటను మొదటి క్రాప్ తీసి కల్లంలో ఆరబెట్టాడు. మార్కెట్‌కు తరలిద్దామనుకున్న ఆయన మహా శివరాత్రి పండుగ దృష్ట్యా ఐదు రోజులు సెలవు వచ్చింది. దీంతో కుప్పపై తాటికమ్మలు కప్పి ప్రతీ రోజూ కాపలా ఉంటున్నాడు. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున కుప్ప వద్దకు వెళ్లి చూడగా మిర్చి మొత్తంగా కాలి బూడిద అయిందన్నారు. సుమారు 80 నుంచి 90 బస్తాలు అవుతుండగా 16 నుంచి 18 క్వింటాళ్లు అవుతుందని రూ.3.50 లక్షల వరకు నష్టం కలిగిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు వెల్లడించారు. సంబంధిత అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని రైతు వేడుకున్నాడు.

విద్యుదాఘాతంతో జీపీ కార్మికుడు మృతి


మంజి (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో గ్రామపంచాయతీ కార్మికుడు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ మండలం కేవులాతండాలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం. కేవులాతండాకు చెందిన బాదావత్ మంజి (58) గ్రామపంచాయతీలో వాటర్‌మెన్‌గా పని చేస్తున్నాడు. తన ఇంట్లో ఉన్న కూలర్ పనిచేయకపోవడంతో దానికి మరమ్మతులు చేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య కౌసల్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఫిబ్రవరిలో 85 శాతం బొగ్గు ఉత్పత్తి

భూపాలపల్లి కృష్ణకాలనీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి సింగరేణి ఏరియా పరిధిలో ఫిబ్రవరి నెలలో 85 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు ఏరియా అధికార ప్రతినిధులు మారుతీ వెల్లడించారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 4.55 లక్షల టన్నులు కాగా.. 3.90 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించినట్లు వెల్లడించారు. అలాగే, బొగ్గు రవాణా లక్ష్యం 4.55 లక్షల టన్నులు కాగా.. 3.27 లక్షల టన్నులతో 72 బొగ్గు రవాణా శాతం సాధిచినట్లు స్పష్టం చేశారు. ఇక మార్చి నెలలో ఏరియాకు మొత్తంగా 6.39లక్షల టన్నులు లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. ఉద్యోగుల నుంచి బొగ్గు ఉత్పత్తి పెంచడానికి కావాల్సిన సలహాలు, సూచనలు చేశామన్నారు. అలాగే, గైర్హాజరు శాతాన్ని తగ్గించి ఉత్పత్తి పెంచే విధంగా కార్మికులు కృషి చేయాలని ఆయన కోరారు.

ప్రభుత్వ కార్యకలాపాలను విద్యార్థులకు చేరవేయాలి

- వరంగల్ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి

ములుగు కలెక్టరేట్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తీసుకుంటున్న కార్యకలాపాలను విద్యార్థులకు క్షేత్ర స్థాయిలో చేరవేయాలని, ఇందుకోసం ప్రధానోపాధ్యాయులు కీలక పాత్ర వహించాలని వరంగల్ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి అన్నారు. శనివారం ములుగులో డీఈవో పాణిని అధ్యక్షతన కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల సమావేశం జరగగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల స్థాయిని బట్టి ఏబీసీడీ గ్రూపులుగా విభజించి మరింత ఉత్తమ ఫలితాల సాధనకు ప్రోత్సహించాలన్నారు. యూడైస్ ప్లస్‌లో సరైన సమాచారం నింపినట్లయితే మనకు కావాల్సిన అవసరాలను ప్రభుత్వం గుర్తించి నిధులు మంజూరు చేసే అవకాశం ఉంటుందని అన్నారు. విద్యార్థులు ప్రతిరోజు తీసుకుంటున్న మధ్యాహ్న భోజనం వివరాలను ఉదయం 11గంటలలోపు యాప్‌లో అప్‌డేట్ చేయాలని అన్నారు. పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని, ప్రీఫైనల్ పరీక్షల్లో ఈసారి రెండు పరీక్షలకు ఓఎంఆర్ షీట్లు కూడా అందజేయడం జరుగుతుందని అన్నారు. దీనిపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు.

ఈ సమావేశంలో డీసీఈబీ కార్యదర్శి సూర్యనారాయణ, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు అర్షం రాజు, కాటం మల్లారెడ్డి, రమాదేవి, గుల్లపల్లి సాంబయ్య, సైకం శ్రీనివాసరెడ్డి, ఏసీజీఈ అప్పని జయదేవ్, జిల్లాలోని ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలను పక్కాగా నిర్వహించాలి

- మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా 20 కేంద్రాలు
- హాజరుకానున్న 9,317 మంది విద్యార్థులు
- జిల్లా ఇంటర్ విద్యాధికారి మదార్‌గౌడ్


సీఎస్, డీవోల సమావేశంలో మాట్లాడుతున్న మదార్‌గౌడ్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాలో ఈనెల 5 నుంచి జరుగనున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి ఎస్కే.మదార్‌గౌడ్ సూచించారు. మహబూబాబాద్‌లోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో శనివారం చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులతో పరీక్షల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వాహకులు సమన్వయంతో పనిచేస్తూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వహించాలని సూచించారు. ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాల ప్రకారం ఈనెల 5న ప్రథమ సంవత్సరం, 6న ద్వితీయ సంవత్సరం విద్యార్థులతో పరీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు. జిల్లావ్యాప్తంగా అన్ని యాజమాన్యాల జూనియర్ కళాశాలల నుంచి ప్రథమ, ద్వితీయ రెగ్యులర్, ఒకేషనల్ విద్యార్థినీ, విద్యార్థులు 9,317 మంది హాజరు కానుండగా, 20 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో ప్రథమ సంవత్సరం జనరల్ విద్యార్థులు 3,196, ఒకేషనల్ విద్యార్థులు 1,199 మొత్తం 4,395, ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థులు 3,716 ఒకేషనల్ విద్యార్థులు 1,206 మొత్తం 4,922 మంది హాజరు కానున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షలను నిర్వహించేందుకు జిల్లా పరీక్షల కమిటీ, ఒక ఫ్లయింగ్ స్క్వాడ్, రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలతో పాటు 20 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, 20 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు కల్పించినట్లు పేర్కొన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 9240205555ను సంప్రదించాలన్నారు. సమావేశంలో రాజకుమారి, కుమార్, సదానందం అధికారులు పాల్గొన్నారు.

వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

ఏటూరునాగారం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భూపాలపల్లి, ములుగు జిల్లాల గిరిజన అభివృద్ధి అధికారి పోశం తెలిపారు. బోయినపల్లిలోని వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో 5వ తరగతిలో బాలురకు 20 సీట్లు, బాలికలకు 20 సీట్లు, 6వ తరగతిలో 9 సీట్లు, 7వ తరగతిలో 10 సీట్లు, 8వ తరగతిలో 7 సీట్లు ఖాళీగా ఉన్నాయని శనివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబాబాద్‌లోని మోడల్ స్పోర్ట్స్ అకాడమీలో 5వ తరగతిలో బాలురకు 40సీట్లు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. గుర్తింపు పొందిన ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలో 4,5,6,7 తరగతులు చదువుతున్న గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తులను 10 మార్చి లోపు ఏటూరునాగారంలోని గిరిజన అభివృద్ధి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9701810567 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.ఎంపిక పరీక్ష ఈ నెల 12న ఏటూరునాగారంలోని ఆకులవారిఘణపురం పాఠశాలలో నిర్వహిస్తామని పేర్కొన్నారు.

వ్యవసాయ విద్యార్థుల ప్రదర్శన


కల్వల రైతు వేదికలో గ్రామ నమూనాను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కేసముద్రం (మహబూబాబాద్ జిల్లా), మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్వల రైతు వేదికలో శనివారం వరంగల్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు సాగుకు సంబంధితఅంశాలపై ప్రదర్శన నిర్వహించారు. గ్రామం నమూనా, భూముల వివరాలు, వ్యవసాయానికి సంబంధించిన వనరుల నమూనాను తయారు చేశారు. కార్యక్రమానికి కేవీకే మల్యాల ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్.మాలతి, ఎంఏవో బి.వెంకన్న, శాస్త్రవేత్తలు కిషోర్‌కుమార్, సీహెచ్.యశస్విని, మానస, హేమ, శరత్‌చంద్ర, రైతులు పాల్గొన్నారు.

కంబాలపల్లిలో..

మహబూబాబాద్ అగ్రికల్చర్ : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వరంగల్ వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా మహబూబాబాద్ జిల్లా కంబాలపల్లి గ్రామాన్ని సందర్శించి వ్యవసాయ సాగు విధానాలను తెలుసుకున్నారు. ఆ విద్యార్థులు గ్రామంలో పర్యటించి భౌగోళిక స్వరూపాన్ని మ్యాప్ ద్వారా గ్రామంలోని రైతు వేదికలో గ్రామ పెద్దలు, అధికారుల ముందు ప్రదర్శించారు. గ్రామ శివారులో సాగుచేసిన వివిధ పంటలను క్షేత్రస్థాయిలో పరీక్షించి ఎలాంటి భూములలో ఏఏ పంటలు వేస్తే లాభదాయకంగా ఉంటుందో.. వ్యవసాయ శాస్త్రవేత్తలను, వ్యవసాయాధికారులను అడిగి తెలుసుకున్నారు. మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ మాలతి మాట్లాడుతూ వివిధ పంటల సాగు వివరాలు, దిగుబడిని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కంబాలపల్లి గ్రామానికి చెందిన రైతులతో పాటు విద్యార్థులు ఎం.శ్రీరాములు, ఎ.కిరణ్, షారుక్, నరేష్, సాయి, విశ్వాంత్ పాల్గొన్నారు.

ఇనుగుర్తిలో..

ఇనుగుర్తి : ఇనుగుర్తి రైతు వేదికలో శనివారం వరంగల్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నమూనా గ్రామాన్ని ఏర్పాటు చేసి వివిధ వ్యవసాయ సంబంధిత అంశాలను వివరించారు. అనంతరం పెండెం వెంకన్న వ్యవసాయ క్షేత్రాన్ని అధికారులు సందర్శించారు. కార్యక్రమంలో మల్యాల కోఆర్డినేటర్ ఎస్.మాలతి, శాస్త్రవేత్తలు ఎన్.కిషోర్, ప్రొఫెసర్లు శరత్‌చంద్ర, మానస, యశస్విని, ఏఈవో భాస్కర్, రైతులు గంజి యాకూబ్‌రెడ్డి, పరుపాటి సంజీవరెడ్డి, దేవేందర్‌రెడ్డి, వల్లంల మురళి పాల్గొన్నారు.

రెండో రోజూ సందడిగా వసంతోత్సవం

» లలిత కళల సమాహారంగా సాగిన ఈవెంట్లు » పోటాపోటీగా పాల్గొన్న విద్యార్థులు » మినీ భారతాన్ని తలపించిన నిట్ క్యాంపస్ » ఉత్సాహపరిచిన కార్యక్రమాలు



కార్యక్రమానికి హాజరైన మ్యాడ్ సినిమా నటీనటులు



నృత్యం చేస్తున్న విద్యార్థులు



సెల్ఫీ దిగుతున్న విద్యార్థులు

హనుమకొండ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నిట్‌లో శనివారం రెండవ రోజు వసంతోత్సవ వేడుక (స్ప్రింగ్ స్ప్రీ-2025) అంగరంగ వైభంగా జరిగింది. రోజంతా పలు అంశాల్లో నిర్వహించిన ఈవెంట్లతో నిట్ క్యాంపస్ సందడిగా మారింది. అన్ని ఈవెంట్లలో విద్యార్థులు పోటాపోటీగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. సంగీత, సాహిత్య, నృత్య, చిత్రలేఖన అంశాల్లోనే కాకుండా సమకాలీన సమాజంలో ఎదురయ్యే సవాళ్లను ఎలా ఎదుర్కోవాలో తెలియచేసే వినూత్న ఈవెంట్లను సైతం నిర్వహించడం ఈ సారి స్ప్రింగ్ ప్రత్యేకత. గత సంవత్సరం నిర్వహించిన స్ప్రింగ్ స్ప్రీలో ప్రదర్శించిన ఈవెంట్ల కన్నా భిన్నంగా మారిన కాలమాన పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఆ మేరకు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించే, కొత్త ఆలోచనలకు ఊతం ఇచ్చే ఈవెంట్లను ఈ సారి ప్రవేశపెట్టారు. ఒక్కో ఈవెంట్ దేనికదే ప్రత్యేకతను చాటుకున్నది. వరంగల్ నిట్‌తో పాటు దేశవ్యాప్తంగా వివిధ నిట్‌ల నుంచి వచ్చిన విద్యార్థులు ఈవెంట్లలో పొల్గొనేందుకు ఒక్క దగ్గర కొలువుదీరడం క్యాంపస్ మినీ భారతాన్ని తలపింప చేసింది. వేష భాషలు, సంస్కృతీ, సంప్రదాయాలు వేరైనా ఈవెంట్లలో పోటీపడిన తీరు మేరా భారత్ మహాన్ చాటిచెప్పింది.

18 ప్రత్యేక ఈవెంట్లు

వివిధ సాంస్కృతిక, సృజనాత్మకత, మేధో పరీక్షలకు అద్దంపట్టే 18 ప్రత్యేక ఈవెంట్లు ఉదయమే ప్రారంభమయ్యాయి. సాయంత్రం జరిగిన మూడు ప్రధాన కార్యక్రమాలు స్టేడియంను ఉర్రూతలూగించాయి. డైరెక్టర్స్ కట్ ఈ వెంట్‌లో భాగంగా తెలుగు సినిమా మ్యాడ్ స్క్వేర్ చిత్ర బృందం నిట్ క్యాంపస్‌ను సందర్శించింది. విద్యార్థులతో ఇష్టాగోష్టిగా మాట్లాడింది. అనంతరం ప్రముఖ నేపథ్యగాయని గీతా మాధురి తన మధుర గానంతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. ఇక రాత్రి పొద్దుపోయే వరకు సాగిన కొరియో నైట్ విద్యార్థులను ఆకట్టుకున్నది. పాటలను అనుగుణంగా విద్యార్థులు చిందులు వేశారు. ఉత్సాహంగా కేరింతలు కొట్టారు.

నేటితో ముగియనున్న స్ప్రింగ్ స్ప్రీ

వరంగల్ నిట్‌లో అంగరంగ వైభంగా జరుగుతున్న వసంతోత్సవం (స్ప్రింగ్ స్ప్రీ-2025) ఆదివారం ముగియనున్నది. ముగింపు కార్యక్రమం అంటూ ప్రత్యేకంగా ఏమీ లేకపోయినా సాయంత్రం 6 గంటలకు ఈవెంట్లన్నిటిని ముగిస్తారు. కొత్త ఈవెంట్లతో పాటు శనివారం ప్రారంభమై ఈవెంట్లలో కొన్ని ఆదివారం కూడా కొనసాగుతాయి. ఉదయం 10 గంటల నుంచే ఈవెంట్లు ప్రారంభమవుతాయి,

మూడో రోజూ ఈవెంట్లు

స్ప్రింగ్ స్ప్రీ మూడవ రోజు (మార్చి 2) నిర్వహించే ఈవెంట్లలో.. నుక్కడ్ నాటక్, ఎస్కేప్ ద గ్రిడ్, పోలరైడ్ ఫోటోగ్రఫీ, హ్యాండ్ ప్రింటింగ్, ఫిల్మ్‌హంట్, ఫిల్మ్‌హౌజ్, రీల్ క్రియేషన్, బ్లిట్జ్ బుల్లెట్ టీం ఎరెనా, థింక్ డ్రాప్ రివీల్, స్ట్రీట్ ఫోటోగ్రఫీ కాంటెస్ట్, పోటరీ మేకింగ్, క్యూఫ్యాక్టర్ జనరల్ క్విజ్, క్యూఫ్యాక్టర్ మైథాలజీ క్విజ్, బ్లిజ్‌క్రెగ్ చెస్ తదితర ఈవెంట్లు ఉంటాయి. ఈ ఈవెంట్లలో పాల్గొని విజేతలైన వారికి నగదు బహుమతులు ఉంటాయి. స్ప్రింగ్ స్ప్రీ చివరి రోజు నిర్వహించే ఫ్యాషన్ పరేడ్ విశేంగా ఆకట్టుకోనున్నది.





హ్యాండ్ ప్రింటింగ్

ఈ ఈవెంట్‌ను గత సంవత్సరంలాగే ఈ సారి కూడా నిర్వహించారు. హ్యాండ్ ప్రింటింగ్ ఒక భావోద్వేగ, మధురజ్ఞాపకాల పోటీ. విద్యార్థులు తమ చేతులకు రంగులను పూసుకొని ఒక తెల్లని వస్త్రం, లేదా దళసరి కాగితంపై ముద్రిస్తారు. అలా పడిన చేతి అచ్చులను కొద్ది సేపు ఆరనిస్తారు. దాని క్రింద తమ పేరు చిరునామ రాస్తారు. అనంతరం పోటీలో పాల్గొన్న తోటి విద్యార్థులు పరస్పరం మార్పిడి చేసుకుంటారు. దీన్ని ఒక జ్ఞాపకంగా పదిలపరుచుకుంటారు.



తానా..బానా

ఇదొక విశిష్టమైన ఈవెంట్.. మొదటి సారి నిర్వహించారు. ఏక్ భారత్- శ్రేష్ట భారత్ అనే నినాదం ఇతివృత్తంగా నిర్వహించిన ఈ ఈవెంట్ ఒక విధంగా సంప్రదాయాలు, ఆహారం, వస్త్రధారణ, నడవడిక పద్ధతులపై అవగాహన పెంచే ఆట. ఇందులో విద్యార్థులు భారతీయ సంప్రదాయాలు, ఆచార వ్యవహా రాలు ప్రతిబింబించేలా రకరకాల వస్త్రధారణలతో పాల్గొన్నారు. భారతీయ వంటకాలను ప్రదర్శనకు పెట్టారు.



ఆన్‌సాల్వ్‌డ్..

ఇది నేరపరిశోధనకు సంబంధించిన ఈవెంట్. మర్డర్ మిస్టరీ పోటీ. నేరపరిశోధనలో విద్యార్థులు గూఢచారులుగా మారిన అనుభవాన్ని పొందుతారు. ఒక గదిలో హత్యకు సంబంధించిన ఆనవాళ్లు ఉంటాయి. హంతకులను గుర్తించడానికి అక్కడ దొరికి క్లూస్‌ను డీకోడ్ చేయాల్సి ఉంటుంది. ఎవరు ముందుగా డీ కోడ్ చేస్తారో వారినే విజేతగా ప్రకటిస్తారు.



స్నేక్ అండ్ ల్యాడర్ ఈవెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు

స్నేక్ అండ్ ల్యాడర్

స్నేక్ అండ్ ల్యాడర్ (పరమ పద సోపానం) ఈవెంట్‌లో కూడా విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇళ్లలో పరమపద సోపాన పటం ముందేసుకొని పాము..నిచ్చెన ఆట ఆడుకోవడం చూస్తాం. ఇది కూడా అంతే. కాకపోతే ఈ సోపాన పటం పెద్దదిగా ఉండి ఒక గది అంతా పరుచుకొని ఉంటుంది, ఇక్కడ గవ్వలకు బదులు ఒక క్యూబ్‌తో ఆడుతారు. ఎవరైతే పాము నోట పడకుండా నిచ్చెనలను ఎక్కుతూ పరమపదసోపానం చేరుతారో వారే విజేత.

వేటికవే విభిన్నం.. వినూత్నం

» నిట్‌లో ఆకట్టుకున్న ఈవెంట్లు

» రెండోరోజూ 18 ఈవెంట్ల నిర్వహణ

హనుమకొండ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నిట్‌లో వసంతోత్సవంలో రెండోరోజూ 18 ఈవెంట్లను నిర్వహించారు. వేటికవే ప్రత్యేకంగా నిలిచాయి. విద్యార్థుల మేధకు పదును పెట్టాయి. వారిలోని సృజనాత్మకతను వెలికితీశాయి. పోటీతత్వాన్ని పెంచాయి.

పేయింట్ బాల్ షూటింగ్



పేయింట్ బాల్ షూటింగ్ ఈవెంట్

ఇదొక వినూత్న ఈవెంట్. ఈ ఈవెంట్‌లో విద్యార్థులకు కొన్ని టార్గెట్లు ఉంటాయి. వారు ప్రత్యేకంగా తయారు చేసిన గన్స్ ద్వారా ఆ టార్గెట్‌ను పేల్చాలి. లక్ష్యానికి గన్‌లోని పేయింట్ బాల్ బుల్లెట్ తగలగానే టార్గెట్ రంగు మారుతుంది. ఎవరైతే సరిగా టార్గెట్‌ను ఛేదిస్తారో వారే విజేతలు.

కుండల తయారీ



కుండల తయారీ ఈవెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు

ప్రతీ సంవత్సరం లాగే ఈ సారి కూడా నిట్ ఆవరణలో కుండల తయారీ పోటీని నిర్వహించారు. ఎవరైతే అందంగా కుండలను తయారు చేస్తారో వారే విజేత. అయితే ఈ పోటీని పర్యవేక్షించేందుకు ఏకంగా కుమ్మరినే నియమించారు. ఆయన క్యాంపస్‌లో ఒక చోట కుండలను తయారు చేయడానికి ఉపయోగించే సారెను, బంక మట్టిని అందుబాటులో ఉంచాడు. కుండలను ఎలా తయారు చేయాలో విద్యార్థులకు నేర్పారు. తాను చేయడంతో పాటు విద్యార్థులతో కూడా చేయించారు. కుండలను తయారు చేయడం అంత సులభం కాదు. దానికి ఎంతో నైపుణ్యం, నేర్పు, ఓర్పు ఉండాలి. అప్పుడే మనం అనుకున్న రీతిలో వివిధ ఆకారాల్లో కుండలు రూపుదిద్దుకున్నారు. గ్రామీణ వృత్తి అయిన ఈ కుండల తయారీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఆర్ట్ థెరపీ



ఆర్ట్ థెరపీ ఈవెంట్

నిట్‌లోని పేయింటింగ్ క్లబ్ ఆధ్వర్యంలో మొదటిసారిగా చిత్రలేఖన పోటీలను నిర్వహించింది. చిత్రలేఖనం ద్వారా భావాలను వ్యక్తీకరించే ఈవెంట్ ఇది. ఇందులో 25 మందికిపైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ జబ్బులకు మందుల ద్వారా చికిత్స చేస్తారు. సంగీతం ద్వారా కూడా రోగికి ఉప శమనం కలిగించవచ్చు. లళిత కళల్లో ఒకటైన చిత్రలేఖనం ద్వా రా కూడా చికిత్స చేయవచ్చనే కొత్త అంశాన్ని ఈవెంట్ ఎత్తిచూపింది.

ప్రగతితో పోరాటం..

వేర్లు బయటపడ్డా చిగురిస్తున్న మోడు



అభివృద్ధి పనులు జరుగుతున్నప్పుడు ప్రకృతి వనరులు కొన్నిటికి నష్టం జరుగుతుండడం సహజం. డార్విన్ సిద్ధాంతం ప్రకారం 'ప్రకృతిలో ప్రతీ జీవి మనుగడ కోసం పోరాటం' చేస్తుందనడానికి ఈ వృక్షమే నిదర్శనంగా నిలుస్తోంది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం రైల్వే అప్ ప్లాట్‌ఫాం వెంట మూడో లైను నిర్మాణంలో భాగంగా మరో ప్లాట్‌ఫాంను కొత్తగా నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో పాత ప్లాట్‌ఫాంను కొంతభాగం తొలగించడంతో అంచున ఉన్న ఓ చెట్టును నరికేశారు. తవ్వకాల్లో ఇలా వేర్లు సహా బయటకొచ్చింది. కానీ ఆ మోడు జవసత్వాలను నింపుకొని మళ్లీ చిగురిస్తోంది. ఇలా ప్రగతితో పోరాటం చేస్తూ ప్రకృతి ప్రేమికులు ఆకర్షిస్తోంది.

- కేసముద్రం, ఆంధ్రజ్యోతి



నెలవంక కనిపించె..

నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు షురూ

మహబూబాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : నెలవంక కనిపించడంతో.. మతసామరస్యం, భక్తిభావానికి ప్రతీకగా నిలిచే ఉపవాసదీక్షల మాసం రంజాన్ ఆదివారం నుంచి ప్రారంభమైంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ముస్లింల ప్రార్థనా స్థలాలైనా.. మస్జీద్‌లను విద్యుత్ దీపాలతో అలంకరించి రంజాన్ ఉపవాస దీక్షల ప్రత్యేక ప్రార్థనలు, సాముహిక ఉపవాస విరమణ కార్యక్రమాలకు సిద్ధం చేశారు. ముస్లిం మతపెద్దలు ప్రత్యేక నమాజ్‌ల కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. లూనార్ క్యాలెండర్ ప్రకారం మార్చి 2 నుంచి ఉపవాస దీక్షలు ఆరంభమవుతాయని ముస్లింలు విశ్వసించినట్లే శనివారం రాత్రి నెలవంక దర్శనమైంది. దీంతో రాత్రి పూట తరవీహ్ నమాజ్‌లను చేసుకుని ఆదివారం తెల్లవారు జాము నుంచి ఉపవాస దీక్షలను ప్రారంభించుకున్నారు. అంతకు ముందే ముస్లింల హిలాల్ కమిటీ నెలవంక దర్శనం ఎక్కడ జరిగినా, జరగకున్నా.. 2వ తేదీ నుంచి దీక్షలు ప్రారంభించుకోవాలని ప్రకటించింది. కాగా, నెలవంక దర్శనం కావడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ముస్లింల ప్రార్థన స్థలాలైన మస్జీద్‌లలో రాత్రి ఉపవాస దీక్షల ప్రారంభానికి సూచికగా సైరన్‌లు మోగించారు.

ఆశల తడి ఆవిరి!

» ఉమ్మడి జిల్లాలో తీవ్రమవుతున్న సాగునీటి కొరత

» ఎండుతున్న యాసంగి పంటలు

» ప్రభుత్వం కేటాయించిన పద్ధతిలో ప్రాజెక్టుల నుంచి అందని నీరు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

యాసంగిలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా రైతులు వరి, మొక్కజొన్న పంటలను సాగు చేశారు. మొదట్లో సన్న వడ్లకు ప్రభుత్వం రూ.500 బోనస్ ఇవ్వటంతో ఎక్కువ మంది రైతులు సన్నాలను సాగు చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఏ యాసంగి సీజన్‌లో 9,26,459 ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేశారు. వీటిలో అత్యధికంగా 6,60,699 ఎకరాల్లో వరి పంటను సాగు చేయగా, 2,46,802ఎకరాల్లో మొక్కజొన్న పంటను, 18,958 ఎకరాల్లో ఇతర పంటలను సాగు చేశారు. వీటితో పాటు మిర్చి, పొగాకు, కందులతో పాటు ఇతర ఉద్యాన పంటలు మరో 2లక్షల ఎకరాల్లో సాగవుతున్నాయి. అత్యధికంగా జనగామ జిల్లాల్లో వరి పంటను 1,80,400 ఎకరాల్లో సాగు చేయగా, మహబూబాబాద్ జిల్లాలో 1,36,112, హనుమకొండ జిల్లాల్లో 1,23,500ఎకరాల్లో వరి సాగయింది. అయితే ప్రధానంగా వరి, మొక్కజొన్నకు నీటి కొరత తీవ్రంగా ఏర్పడింది. ముదురుతున్న ఎండలతో భూగర్భ జలాలు ఎండిపోవటమే కాకుండా, చెరువులు, కుంటల్లో నీటి జాడలు లేకుండా పోతున్నాయి. దీంతో పంటలకు చివరి తడి అందక రైతులు తల్లడిల్లుతున్నారు. చాలా ప్రాంతాల్లో రైతులు నీళ్ల లేక పంటలను పశువులకు మేతకు వదిలేస్తున్నారు.

ఆదుకోని దేవాదుల నీళ్లు

యాసంగి పంటలకు సాగునీటి కష్టాలు రైతులకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. ప్రధానంగా దేవాదుల ప్రాజెక్టు ద్వారా ఈ యాసంగిలో 1,73,153 ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ఇప్పటి వరకు దేవాదుల ద్వారా 4.965టీఎంసీల నీటినే ఎత్తిపోశారు. ఒక టీఎంసీ 10వేల ఎకరాలకు సాగునీరు అందించిన ఇప్పటి వరకు కేవలం 50వేల టీఎంసీలకే దేవాదుల గోదావరి నీళ్లు అందాయి. ఇంకా లక్ష 23ఎకరాలకు నీళ్లు ఎట్లా అనే ఆందోళనలో రైతులున్నారు. ప్రధానంగా దేవాదుల నీటిపైనే కోటి ఆశలతో జనగామ జిల్లాల్లో రైతులు వరిసాగు చేశారు. దేవాదుల నీళ్లు ఆశించిన స్థాయిలో రైతులకు అందకపోవటంతో స్టేషన్‌ఘనపూర్, లింగాలఘనపూర్, కొడకండ్ల, జనగామ, పాలకుర్తి తదితర మండలాల్లో వందలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయి. మల్లన్నగండి, నవాబుపేట, బొమ్మకూరు, లద్నూరు, చీటకోడూరు, అశ్వరావుపల్లి, వెల్దండి జలాశయాలకు దేవాదుల నీరు చేరితేనే అక్కడి నుంచి కాలువలు, వాగుల ద్వారా నీరు రైతు పంట పొలాలకు చేరాల్సి ఉంది. దేవాదుల నీరు చివరి వరకు అందకపోవటంతో జనగామ జిల్లాలో కరువు పరిస్థితులు నెలకొంటున్నాయి. స్టేషన్‌ఘనపూర్ మండలం ఇప్పగూడెం వద్ద 3ఎల్ కెనాల్ ద్వారా 20రోజులుగా గోదావరి జలాలు రాకపోవటంతో వరి, మొక్కజొన్న పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగునీరందించాలని డిమాండ్ చేస్తు ఫిబ్రవరి 27వ తేదీన రైతులు జనగామ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయగా, 28వ తేదీన హుస్నాబాద్ ప్రధాన రహదారిపై రైతులు ధర్నా చేయాల్సి వచ్చింది.

కన్నీటి కష్టం..

ఎస్సారెస్పీ నీళ్లు అంతంతే..

ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఎస్ఆర్ఎస్పీ కింద సుమారు 5లక్షల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎస్సారెస్పీ ఫేజ్-1 కింద 3.61లక్షల ఎకరాలు, ఫేజ్-2 కింద 1.13లక్షల ఎకరాలు సాగవుతున్నాయి. అయితే ఎస్సారెస్పీ ఫేజ్-1 కింద పరకాల, భూపాలపల్లి, ములుగు, నర్సంపేట, డోర్నకల్, మహబూబాద్, వర్ధన్నపేట నియోజకవర్గాల పరిధిలో యాసంగిలో సుమారు 2లక్షల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. అయితే డీబీఎం-38 కాలువలో నీళ్లు రాకపోవటంతో భూపాలపల్లి జిల్లా రేగొండ, చిట్యాల, టేకుమట్ల మండలాల్లో రైతులు అవస్థలు పడుతున్నారు. ఎస్సారెస్పీ ఫేస్-2 కింద వరంగల్ జిల్లా వర్ధన్నపేటతో పాటు పాలకుర్తి, డోర్నకల్ నియోజకవర్గాలకు సంబంధించి సుమారు 70వేల ఎకరాలకు ఈ యాసంగిలో సాగునీరు అందించాల్సి ఉంది. అయితే గత రెండువారాలుగా ఎస్సారెస్పీ కాలువల నుంచి నీళ్లు రాకపోవటంతో ఈ ప్రాంత రైతులు ఆందోళనకు దిగుతున్నారు. రెండురోజుల క్రితం చింతగట్టులోని ఎస్సారెస్పీ కార్యాలయం ఎదుట ఐనవోలు మండలం వెంకటాపూర్ గ్రామ రైతులు ధర్నాకు దిగారు. అలాగే రామప్ప నుంచి పాఖాల, గణపసముద్రం చెరువుల్లోకి గోదావరి నీటిని విడుదల చేయాల్సి ఉంది. అయితే రామప్ప చెరువు కింద 6,780 ఎకరాలు సాగవుతుంది. ప్రస్తుతం చెరువులో 27.7ఫీట్ల వరకే నీళ్లు ఉండటంతో, తాగునీటి అవసరాల దృష్ట్యా సాగు కోసం నీటిని గణపసముద్రంతో పాటు పంటలకు విడుదల చేయటంపై అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. అలాగే లక్నవరం సరస్సులో 23.6ఫీట్లే నీళ్లు ఉన్నాయి. ఈ సరస్సు కింద 4,150ఎకరాలు చేస్తున్నారు. పాఖాల సరస్సు కింద 10,500 ఎకరాల్లో పంట సాగు చేస్తుండగా, 21.5ఫీట్ల వరకు నీళ్లు ఉన్నాయి. ఈ సరస్సుల కింద పంట సాగుకు ఇబ్బంది లేకున్నా.. రాబోయే రోజుల్లో తాగునీటికి ఇబ్బందులు ఎదురుకానుందనే ఆందోళన వ్యక్తం అవుతుంది.

- మహబూబా బాద్ జిల్లా కేసము ద్రంలో వట్టివాగు ఎండిపోవటంతో సుమారు వెయ్యి ఎకరాలకు సాగునీళ్లు కరువయ్యాయి. ఇలా చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లో నీళ్ల లేకపోవటంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి.
- జనగామ జిల్లా కొడకండ్ల మండలం రామవరంలో గరిడె శ్రీనివాస్, యాకయ్య కొత్తగా రెండు బోర్లు వేసినా చుక్కనీరు పడకపోవటంతో వరి పంటపై ఆశలు వదులుకొని, పశువులకు మేతగా చేశారు.
- భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రానికి చెందిన కనిరిరెడ్డి అనే రైతు రెండు ఎకరాల్లో వరి సాగు చేసి, రూ.70వేల వరకు పెట్టుబడి పెట్టారు. అయితే డీబీఎం-38 కాలవ నుంచి చుక్క నీరు రాకపోవటంతో పంట ఎండిపోతుంది. దీంతో శనివారం తన పంటలను పశువులకు మేతగా మార్చి నిరసన వ్యక్తం చేశారు.
- జనగామ మండలం సిద్దెంకి, గానుగుహడ్ గ్రామాల్లో సాగునీరు లేక పంటలు ఎండిపోవడంతో రైతులు రాములు, శ్రీనివాస్‌లు గొర్రెలు, మేకలు, పశువులకు మేతగా వదిలేశారు.



ఎండిపోతున్న పంటలకు నీరందించాలని జనగామలో ధర్నా చేస్తున్న రైతులు (ఫైల్)



లింగాలఘనపూర్ మండలంలో ఎండుతున్న పంట

ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో వివిధ ప్రాజెక్టులు, చెరువుల కింద యాసంగి పంటలకు సాగు ప్రణాళిక ఇలా..

ప్రాజెక్టు	ఎకరాలు
దేవాదుల	1,73,153
కాళేశ్వరం	73,0370
బొగ్గులవాగు ప్రాజెక్టు	2,500
పాఖాల సరస్సు	10,500
రామప్ప సరస్సు	6,780
లక్నవరం	4,150
మల్లూరు వాగు ప్రాజెక్టు	1,500
పాలెం వాగు ప్రాజెక్టు	6,000
ఎస్సారెస్పీ ఫేజ్-1	3,61,078
ఎస్సారెస్పీ ఫేజ్-2	1,36,030

ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో పంటల సాగు వివరాలు

జిల్లా	వరి (ఎకరాల్లో)	మొక్కజొన్న (ఎకరాల్లో)	ఇతర పంటలు (ఎకరాల్లో)	మొత్తం (ఎకరాల్లో)
వరంగల్	1,05,500	1,03,530	3,100	2,12,130
హనుమకొండ	1,23,500	62,120	4,150	1,89,770
జనగామ	1,80,400	12,530	4,511	1,97,441
మహబూబాబాద్	1,36,112	45,714	4,814	1,86,640
భూపాలపల్లి	83,859	18,582	633	1,03,074
ములుగు	31,328	4,326	1,750	37,404
మొత్తం	6,60,699	2,46,802	18,958	9,26,459

ప్రతీ దివ్యాంగుడికి యూడీఐడీ నంబర్ జనరేట్ చేయాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర సెర్ప్ సీఈవో దివ్య

ములుగు కలెక్టరేట్/భూపాలపల్లి కలెక్టరేట్ మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతి దివ్యాంగుడికి యూడీఐడీ నెంబర్ జనరేట్ చేయాలని రాష్ట్ర సెర్ప్ సీఈవో డి.దివ్య పేర్కొన్నారు. శనివారం ఆమె హైదరాబాద్ నుంచి కలెక్టరేట్‌లో ములుగు కలెక్టర్ టీఎస్.దివాకర, భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. దివ్యాంగులకు యూడీఐడీ కార్డు జారీ ప్రక్రియ, తీసుకోవాల్సిన చర్యలు, సోలార్ విద్యుత్ ప్లాంట్‌ల ఏర్పాటుకు ప్రణాళిక కలు, తదితర అంశాలపై చర్చించి పలు సూచనలు చేశారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కార్యాలయంలో పనిచేసే డాటా ఎంట్రీ ఆపరేటర్లు, మీసేవ కేంద్రాల నిర్వాహకులు, పంచాయతీ కార్యదర్శులు, సీసీలు, ఎంపీడీవోలు, ఏడీఎం, సంబంధిత అధికారులకు యూడీఐడీ దరఖాస్తుల నమోదుపై శిక్షణ ఇవ్వాలన్నారు. జిల్లాలో ఉన్న దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లకు బదులుగా యూనిక్ డిజెబిలిటీఐడీ కార్డులు జారీ చేయడం జరుగుతుందని, ఇవి ఇతర రాష్ట్రాల్లో కూడా ఉపయోగపడతాయని అన్నారు సదరం సర్టిఫికెట్ నుంచి యూడీఐడీ కార్డు జనరేట్ చేసిన తర్వాత యూడీఐడీ కార్డు చేరని దివ్యాంగులు ఎవరైనా ఉంటే సదరు వివరాలు సేకరించి రిపోర్టు చేయాలని, యూడీఐడీ కార్డుపై వైద్యులకు కూడా అవగాహన కల్పించాలన్నారు. ఆస్పత్రిలో యూడీఐడీ డిజెబిలిటి నిర్ధారణ కోసం అవసరమైన వైద్యులు, పరికరాలు ఉండేలా చూడాలని, క్యాంపు సమయంలో దివ్యాంగులకు కుర్చీలు, తాగునీరు వంటి వసతులు కల్పించాలన్నారు. ప్రతి దివ్యాంగుడిని వైద్యులు ధ్రువీకరించిన వైకల్యశాతంతో కూడిన సదరం సర్టిఫికెట్‌ను యూడీఐడీ పోర్టల్‌లో నమోదు చేయాలని, దివ్యాంగులకు సంబంధించి ఇతర వివరాలు సంపూర్ణంగా నమోదు చేయాలన్నారు. దివ్యాంగులకు యూడీఐడీ కార్డు స్పీడ్‌పోస్టు ద్వారా అందుతుందని తెలిపారు. ఫిబ్రవరి 28, 2025 వరకు జారీ చేసిన సదరం సర్టిఫికెట్లతో చేయూత పెన్షన్, ఇతర సదుపాయా లను మన రాష్ట్రంలో దివ్యాంగులు పొందవచ్చని, ఇతర రాష్ట్రాల్లో ఏదైనా సౌకర్యం పొందాలంటే దివ్యాంగులకు యూడీఐడీ కార్డు తప్పనిసరి అని అన్నారు. మార్చి 1నుంచి దివ్యాంగులకు యూడీఐడీ జారీ చేయడం జరుగుతుందని, వీటి ద్వారానే పెన్షన్, ఇతర సౌకర్యాలు పొందాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నూతనంగా యూడీఐడీ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఆస్పత్రిలో స్లాట్ బుకింగ్ చేసి సమాచారం అందించాలని, నిర్ధారణ పరీక్షలు నిర్వహించిన తర్వాత యూడీఐడీ జనరేట్ చేయాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సంపత్‌రావు, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీశ్వర్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్,విజయలక్ష్మీ, జీజీహెచ్ సూపరింటెండెంట్ నవీన్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ దివాకర, అధికారులు

ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో గోపాల్‌రావు

ములుగు కలెక్టరేట్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రజలకు మెరుగైన వైద్యసేవ లందించాలని డీఎంహెచ్‌వో గోపాల్‌రావు అన్నారు. శనివారం ములుగులో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పనితీరు, మాతృ మరణాలపై జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎనిమియా ముక్తిభారత్ కార్యక్రమంలో ఆరులనెలల నుంచి 59నెలల మధ్య పిల్లలకు ఐరన్‌పోలిక్ సిరప్స్, పింక్, రెడ్, బ్లూ ఐరన్ మాత్రలు అందించా లన్నారు. అసంక్రమిక వ్యాధుల ప్రత్యేక స్క్రీనింగ్‌ను ఈనెలాఖరు వరకు పూర్తి చేయాలని సూచించారు. రాబోయే వేసవిలో వచ్చే వడదెబ్బకు తీసుకోవాల్సిన నివారణ చర్యలకు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాల్లోని సిబ్బంది ముందస్తు కార్యాచరణ తయారు చేసుకోవాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో విపిన్‌కుమార్, ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌వో క్రాంతికుమార్, వివిధ విభాగాల డాక్టర్లు శ్రీకాంత్, పవన్ కుమార్, చంద్రకాంత్, రణధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు సేవలందించడమే అధికారుల లక్ష్యం

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి కృష్ణకాలనీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రజల మన్ననలు పొందిన అధికారులు చిరస్థాయిలో గుర్తుంటారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి జిల్లా సంక్షేమాధికారిగా విధులు నిర్వర్తించిన కొట్టే చిన్నయ్య ఉద్యోగ విరమణ పొందారు. ఆయనకు వీడ్కోలు పలికేందుకు జిల్లా కేంద్రంలోని సింగరేణి మినీ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం చిన్నయ్య-కస్తూరి దంపతులను శాలువా, పూలమా లతో ఘనంగా సత్కరించి మెమొంటోను బహూకరించారు. కాగా, ఇట్టి సన్మాన కార్యక్రమంలో ఆర్‌జేడీ ఝాన్సీ సైతం పాల్గొని చిన్నయ్య దంపతులను సన్మానించారు. వీరితో పాటు డీపీఆర్‌ఓ శ్రీనివాస్, భూపాలపల్లి సీడీపీవో మల్లీశ్వరి, ఐసీడీఎస్ భూపాలపల్లి, మహదేవపూర్ ప్రాజెక్టుల సూపర్వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

ఎయిర్‌పోర్ట్ కోసం సీఎం ప్రత్యేక చొరవ

భూపాలపల్లిటౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వరంగల్ మామునూరులో ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపారని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వరంగల్‌లో ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. గతంలో నుంచి ఇప్పటివరకు సీఎం రేవంత్‌రెడ్డి పలుమార్లు వరంగల్‌లో ఎయిర్‌పోర్ట్ కావాలని కోరారని అన్నారు. లేఖలు కూడా రాశారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వశాఖకు లేఖలు అందజేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తుచేశారు. అలాగే కేంద్రం దానిని అంగీకరించి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు.

డిజిటల్ లిటరసీ అనేది చాలా ముఖ్యం

భూపాలపల్లి కృష్ణకాలనీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ లిటరసీ అనేదిచాలా ముఖ్యమని జిల్లా కోర్టు జడ్జీ పి. నారాయణబాబు అన్నారు. శనివారం భూపాలపల్లి జిల్లా కోర్టు ఆవరణలో డిజిటల్ యుగంలో అన్‌లైన్ కేసులను ఎలా ఫైల్ చేయాలని, ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాల పట్ల ఎలా జాగ్రత్తగా ఉండాలనే అంశాలపై సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాలను జిల్లా జడ్జి ప్రారంభించారు. ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, సోషల్ మీడియా, ఏటీఎంల ద్వారా పెద్ద ఎత్తున ఆర్థిక నేరాలు జరుగుతున్నాయని, వీటన్నిటి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీనియర్ సివిల్ కోర్టు జడ్జి జయరాంరెడ్డి, ప్రిన్సిపల్ సియర్ సివిల్ జడ్జీ ఎన్. రామచంద్రారావు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జీ అఖిల, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అనితా వాణితో పాటు న్యాయవాదులు పాల్గొన్నారు.

రైతుల ఆత్మహత్యలకు ప్రభుత్వానిదే బాధ్యత



విలేకరులతో మాట్లాడుతున్న నాగూర్ల వెంకటేశ్వర్‌రావు

మొగుళ్లపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఉరివే సుకుని, పురుగుల మందు తాగి రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారని, ఇందుకు కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన బాధిత అరికాంతపు రాజు కుటుం బ సభ్యు లను పరామర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. అనంతరం ఎస్సీకాలనీలో ఇటీవల చనిపోయిన బండారి భీమయ్య కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజే శారు. ఈకార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కొడారి రమేష్, చదువు అన్నారెడ్డి, గుడిమల్ల రమేష్, ఎరబాటి మహేందర్, రంపీస రాజేందర్, రవికుమార్, బండారి భిక్షపతి, పడిదల జగ్గారావు పాల్గొన్నారు.

జిల్లా రైతులను ఆదుకోవాలి

భూపాలపల్లి కృష్ణకాలనీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునీటి కొరత వల్ల పంటలు ఎండిపోయే పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయని, రైతాంగాన్ని ఆదుకోవాల్సిన అవసరం ఉందని మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. శనివారం ఇరిగేషన్ ఈఎన్‌సీతో ఫోన్‌లో మాట్లాడినట్లు ఆయన ఆంధ్రజ్యోతికి తెలిపారు. డీబీఎం 16, డీబీఎం 18, డీబీఎం 38 కాలువల్లో నీటి విడుదల స్థాయి పెంచాల న్నారు. తాను శివరాత్రికి భూపాలపల్లి నియోజకవర్గంలో పర్యటించి నప్పుడు రైతులు వారివారి ఇబ్బందులు తెలిపారన్నారు. నాగారం, లోలెవల్ తూము ద్వారా నీటిని పెద్దవాగు విడుదల చేసి పంటలను కాపా డాల న్నారు. రైతులకు సాగు నీరు అందించకుంటే బీఆర్‌ఎస్ పక్షాన పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతామని మధుసూదనాచారి తెలిపారు.

హేమాచల క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

20 వేలకు పైగా భక్తుల దైవ దర్శనాలు



హేమాచల క్షేత్రంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

మంగపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) మండలంలోని మల్లూరు హేమాచలకొండలపై వెలిసియున్న ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనర్సింహస్వామిని శనివారం సుమారు 20 వేలకు పైగా భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. భక్తులు ముందుగా చింతామణి జలధారల వద్ద పుణ్య స్నానాలు చేసి జలాంజనేయాస్వామిని, పంచము ఖాంజనే యాస్వా మిని, శ్రీ వేణుగోపాలస్వామిని, రమ సత్యనారా యణస్వామిని తమ దైన శైలిలో దర్శనాలు చేసుకొని మొక్కులు చెల్లించుకున్నారు. తదన ంతరం కొండపై కొలువైన స్వయాంభు పుట్టుస్వామిగా విరాజి ల్లుతున్న లక్ష్మీనర్సింహస్వామిని పక్కనే కొలువుదీరిన అమ్మవార్లయిన ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి దేవతలను భక్తులు దర్శించుకున్నారు. దేవస్థానం ఈ.వో శ్రవణపు సత్యనారాయణ, ఉద్యోగులు సీతారామలు, శేషు, లక్ష్మీనారాయణలతో పాటు తాత్కాలిక ఉద్యోగులు భక్తులకు ఏర్పాట్లు చేశారు.

అలరించిన చిరుతల రామాయణం

చిట్యాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బావుసింగ్‌పల్లి గ్రామంలో చిరుతల రామాయణం ప్రజలకు అలరించింది. ఫిబ్రవరి 24న ప్రారంభమైన చిరుతల రామాయణం శనివారం శ్రీ సీతారామ పట్టాభిషేకంతో ముగిసింది. బాలకాండ, అయోధ్యకాండ, అరణ్యకాండ, కిష్కింధకాండ, యుద్ధకాండ, రావణవధ , పట్టాభిషేకం నాటికలను చూసేందుకు గ్రామంతో పాటు జడల్‌పేట, కొత్తపేట, గాంధీ నగర్, నైన్‌పాక, ఒడితల, గోపాలపురం గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కళాకారులు వివిధ పాత్రలలో నటించారు.



చిరుతల రామాయణం నాటకం వేస్తున్న కళాకారులు

కార్యకర్తలను కాపాడుకుంటాం..

మంగపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) ప్రతి కార్యకర్త నాయకుడికి అందుబా టులో ఉండి అండగా ఉంటానని బీఆర్‌ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు(లక్ష్మణ్‌బాబు) కార్యకర్తలకు భరోసాను ఇచ్చారు. శనివారం మండలంలోని కమలాపురంలో ఇటీవల అనారోగ్యాలతో బాధపడుతూ మృతి చెందిన కుటుంబాలను, రోడ్డు ప్రమాదాలలో గాయపడి ఇండ్ల వద్ద ఉన్న వారి కుటుంబాలను లక్ష్మణ్‌బాబు పరామర్శించి ఓదార్చారు కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు కాకులమర్రి ప్రదీప్‌రావు, బీఆర్ఎస్ మహిళ విభాగం మండల అధ్యక్షురాలు గోస్కుల లక్ష్మియాదవ్, మండల ప్రధానకార్యదర్శి పి. పార్వతి, సీనియర్ నాయకులు చీకుర్తి సుధాకర్, బట్టు శ్రీను, పబ్బోజు సత్యనారాయణచారి, యాదేండ్ల రాజయ్య, ఎలవర్తి శ్రీనివాస్, టి. సత్యనారాయణ, జి. చందర్‌రావు, ఆకుల ప్రభాకర్, పి. వెంకట్‌రెడ్డి, గుంగుల శ్రీనివాస్, తుక్కాని శ్రీనివాస్, జహీంగీర్ పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న కార్యకర్తలను ఆదుకుంటాం

ఏటూరునాగారం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మండలంలోని శంకరాజుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త పోలం సురేష్ పెరాలిసిస్‌తో బాధపడుతూ మెరుగైన వైద్యం చేసుకోవడానికి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న శ్రీనివాస్ శంకరాజుపల్లి కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులతో కలిసి శనివారం సురేష్‌కు రూ. 8500 రూపాయలను ఆర్థిక సహాయం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అనుము లక్ష్మయ్య, పోలం వెంకటేష్, బాసాని రాకేష్, జాడి రమేష్, వాసం రాంబాబు, బోడ్డు ముకుందరావు, అనుము సంపత్ తదితరులు పాల్గొన్నారు.

రాజలింగమూర్తి హత్య కేసులో పురోగతి

- ఏ 9 నిందితుడి రిమాండ్

భూపాలపల్లి కృష్ణకాలనీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలో గత నెల 19న సామాజిక కార్యకర్త నాగవెల్లి రాజలింగమూర్తి హత్య ఘటనలో బాధ్యుడిగా ఉన్న ఏ9 నిందితుడు పుల్ల నరేష్‌ను రిమాండ్‌కు తరలించినట్లు భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్ వెల్లడించారు. ఈ మేరకు శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. భూపాలపల్లి పట్టణంలోని 5 ఇంక్లైన్ సమీపంలో శుక్రవారం అతడిని అదుపులోకి తీసుకున్నట్లు స్పష్టం చేశారు. మిగిలిన ఇద్దరు నిందితులను త్వరలోనే పట్టుకొని రిమాండ్‌కు పంపిస్తామని సీఐ స్పష్టం చేశారు.

జిల్లా కేంద్రంలో గత నెల 19న జరిగిన హత్య ఘటనపై గత నెల 23న ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసి పోలీసులు రిమాండ్ పంపించిన విషయం విదితమే. తాజాగా శనివారం ఏ9 నిందితుడిని కూడా రిమాండ్‌కు పంపించారు. కాగా, ఈ కేసులు బాధ్యులుగా ఉన్న ఏ8 నిందితుడు, బీఆర్‌ఎస్ మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ హరిబాబుతో పాటు ఏ10 నిందితుడు పుల్లా సురేష్‌లు ఇంకా పరారీలోనే ఉన్నారు. ప్రధానంగా ఏ8 నిందితుడిగా ఉన్న హరిబాబును పట్టుకునేందుకు రెండు బృందాలు గాలిస్తున్నట్లు తెలుస్తోంది.

మాదిగ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి



మహదేవపూర్ మండల కేంద్రంలో నివాళులర్పిస్తున్న నాయకులు

గోవిందరావుపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మాదిగ అమరవీరుల త్యాగా లు వెలకట్టలేనివని ఎమ్మార్పీ ఎస్ జాతీయ అధ్యక్షుడు ఇరుగు పైడి అన్నారు. మండలంలోని పస్రాలో మండల అధ్యక్షుడు పసుల భద్రయ్య ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల సంస్మరణసభ శనివారం జరగగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు గడ్డం సారయ్య, దేపాక కృష్ణ, పంగ శ్రీను, దుర్గారావు, పసుల సమ్మయ్య, యాకోబు, ప్రవీణ్ పాల్గొన్నారు.

● ఏటూరునాగారం : మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద మాదిగ అమరవీరుల దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు వావిలాల స్వామి,ఎంఎస్పీ ములుగు జిల్లా ఉపాధ్యక్షుడు వావిలాల సాంబశివరావు పాల్గొన్నారు.

● ములుగు కలెక్టరేట్ : ములుగు జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద శనివారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కోతి కార్తీక్ ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల దినోత్సవం ఘనంగా జరిగింది. ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి శ్యాంబాబు, నాయకులు పాల్గొన్నారు.

●వెంకటాపూర్ : మండలకేంద్రంలోని తాళ్లపాడు సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మోరె లింగస్వామి, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు దొమ్మటి రమేష్‌ల ఆధ్వర్యంలో శనివారం మాదిగ అమరవీరుల దినోత్సవం ఘనంగా జరిగింది. ఎంఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాడపాక శ్యామ్, ఎమ్మార్పీఎస్ నాయకులు చంటి భద్రయ్య, కుక్క అశోక్, చరణ్, విజయ్, రాజ్‌కుమార్, తనుష్, పాల్గొన్నారు.

● మంగపేట : ఎస్సీలలో ఏబీసీడీ వర్గీకరణ కోసం ఉద్యమించి అమరులైన మాదిగ అమర వీరుల ఆశయాలను ప్రతి మాదిగ కొనసాగించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక సభ్యుడు యెంపెల్లి సమ్మయ్య మాదిగ పిలుపు నిచ్చారు. శనివారం మంగపేటలోని తెలంగాణ సెంటర్‌లో మాదిగ అమర వీరుల దినోత్సవ వేడుకలను ఎమ్మార్పీఎస్ మండల కమిటి ఆధ్వర్యంలో మాదిగ అమర వీరులను స్మరించుకొని శ్రద్ధాంజలి ఘటించి పలువురు నాయకులు మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పరికి శ్రీనివాస్, యెంపెల్లి వీరస్వామి, ఎల్పీ రవిమాదిగ, నైనారాపు కేశవులుమాదిగ, గాజర్ల రాజుమాదిగ పాల్గొన్నారు.

●భూపాలపల్లిటౌన్ : మాదిగ అమరవీరులకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులు అర్పించారు. శివారం భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంజేఎఫ్ నాయకులు నోముల శ్రీనివాస్, రేణుకుంట్ల రవి పాల్గొన్నారు.

●మహదేవపూర్ : మహదేవపూర్ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద మాదిగ అమరవీరుల దినోత్సవ వేడుకలను శనివారం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బెల్లంపల్లి సురేష్ మాదిగ, సీనియర్ నాయకులు వేమునూరి జక్కయ్య పాల్గొన్నారు.

●మల్హర్ : మండల కేంద్రమైన తాడిచర్లలో శనివారం మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల ఫ్లెక్సీకి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కేశారపు నరేష్, బూడిద సతీష్, నారమల్ల పోచయ్య, ఇందారపు మహేందర్, జంగం పోచయ్య, మహేష్ పాల్గొన్నారు.

●వాజేడు: మండలకేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు స్వామి ఆధ్వర్యంలో శనివారం మాదిగ అమరవీరుల దినోత్సవం ఘనంగా జరిగింది. రాష్ట్ర నాయకుడు వావిలాల స్వామి, నాయకులు చెన్నం ఎల్లయ్య, బలుసుపాటి రాజు, అరికిళ్ల వేణు, కర్నె ఓంకార్, చెన్నం ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

● టేకుమట్ల : మండల కేంద్రంలో శనివారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రేణుకుంట్ల శంకర్ ఆధ్వర్యంలో మాదిగ అమరవీరులకు ఘన నివాళ్లు అర్పించారు. అనంతరం ఆ సంఘం జిల్లా నాయకుడు రాంచందర్ మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు రేణుకుంట్ల సంపత్, కన్నూరి సారయ్య, అక్కల రాజయ్య, మండల నాయకులు అంబాల సారయ్య, మచ్చ సారయ్య, మచ్చ పైడి, మచ్చ సరోత్తం పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ పనులను ప్రారంభించిన డీఈ

ములుగు కలెక్టరేట్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వేసవిలో నిరంతర విద్యుత్ సరఫరా లక్ష్యంగా 33కేవీ అంతర్గత విద్యుత్‌లైన్ పనులను డీఈ పులుసం నాగేశ్వర్‌రావు శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ములుగులోని సాయిబాబా గుడి నుంచి పత్తిపల్లి సబ్‌స్టేషన్ వరకు విద్యుత్ స్తంభాలు వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ వేణుగోపాల్, కన్‌స్ట్రక్షన్ ఏఈ హరీష్, తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడి వ్యక్తి మృతి

గణపురం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన పుప్పాల రవి(47) టీఎస్ఆర్టీసీ పరకాల డిపోలో బస్ మెకానిక్‌గా పనిచేస్తూ పరకాలలోనే అద్దెకు నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం రవి మండల కేంద్రంలోని సొంత ఇంటికి పని నిమిత్తం వచ్చాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి పూట మొహం కడుక్కునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడినట్లు తెలిపారు. స్థానికుల సహాయంతో రవిని బయటకు తీశారు. కాగా రవి తల్లిదండ్రులు దైవదర్శనానికి తిరుపతి వెళ్లినట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య లతా భవాని, ఒక కూతురు, కుమారుడు ఉన్నారు.

బాధిత కుటుంబానికి బీఆర్‌ఎస్ చేయూత

గోవిందరావుపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రుతండాలో బానోత్ ఈకమ్మ ఇల్లు ఇటీవల అగ్నిప్రమాదంలో కాలిపోగా నిరాశ్రయురాలైంది. ఈవిషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈసందర్భంగా నిత్యావసర సరుకులతోపాటు 25కిలోల బియ్యం, వంట సామగ్రి, దుస్తులు, దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లకావత్ నర్సింహనాయక్, నాయకులు సూడి శ్రీనివాసరెడ్డి, జగదీశ్, స్వరూప, విజయ, మధుసూదన్‌రెడ్డి, రాంచందర్, చందూలాల్, సాంబయ్య, హనుమ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

- బీఆర్‌ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ బాబు

ఏటూరునాగారం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని బీఆర్‌ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు (లక్ష్మణ్ బాబు) హామీ ఇచ్చారు. శనివారం మండలంలోని శంకరరాజుపల్లి గ్రామానికి చెందిన పూజారి పుష్పలత, గండం అనుసూర్య, రొయ్యూరు గ్రామానికి చెందిన కవిరి మధు తదితర మృతుల కుటుంబాలను ఆయన పార్టీ నాయకులతో కలిసి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ ఎస్ మండల పార్టీ నాయకులు కాకులమర్రి ప్రదీప్ రావు, తాడూరి రఘు, ఎమ్డీ. వలీబాబా, కురుమా శ్రీనివాస్, అత్కూరి రాంబాబు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో అవగాహన సదస్సు

కాటారం, మార్చి 1(ఆంధ్రజ్యోతి):మండలంలోని కాటారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం విజ్ఞానశాస్త్ర అవగాహన సదస్సు నిర్వహిం చారు. డిస్కవరీ ఆఫ్ రామన్ ఎఫెక్ట్ డే సందర్భంగా పలువురు ప్రొఫెసర్లు హాజరై నవభారత నిర్మాణ అభివృద్ధిలో భాగంగా ఇంప్రూవ్‌మెంట్ ఆఫ్ ఇండియన్ యూత్ పర్ గ్లోబల్ లీడర్‌షిప్ ఇన్ సైన్స్, టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ జాయింట్ సెక్రటరీ ప్రొఫెసర్ రవీందర్, జోనల్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ కిషన్, వాగ్దేవి ఫార్మసీ కళా శాల ప్రొఫెసర్ రాధాకిషన్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజ్‌కు మార్ మాట్లాడారు. పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

మీ సేవ కేంద్రాలను తనిఖీ చేసిన అధికారులు

భూపాలపల్లి కృష్ణకాలనీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంతో పాటు మంజూర్‌నగర్‌లోని మొత్తం నాలుగు మీసేవా కేంద్రాలను అధికారులు శనివారం తనిఖీ చేశారు. భూపాలపల్లి తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ రామస్వామి, ఈడీఎం శ్రీకాంత్‌లు తహసీల్ కార్యాలయం ఎదురుగా ఉన్న మీసేవతో పాటు మంజూర్‌నగర్‌లోని పాత కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన మీసేవ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రజలకు అందిస్తున్న సేవలను ఆరా తీసి.. నిర్ణీత రుసుం కంటే అదనంగా డబ్బులు తీసుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతీ మీసేవా కేంద్రంలో ధరల పట్టిక తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

వైభవంగా గ్రామదేవతల బొడ్రాయి వేడుకలు

మంగపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) మండలంలోని శనిగకుంట గ్రామంలో గ్రామ దేవతలు బొడ్రాయి వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. గ్రామ దేవత మూర్తులైన సీతా పరమేశ్వరి, బొడ్రాయి, ఆదిలక్ష్మి, భూలక్ష్మి, ముత్యాలమ్మ, పోతురాజు, ఆంజనేయస్వామి పరివార గ్రామ దేవతల స్థిరయాత్ర జీవనప్రమాణ మూర్తుల రాత్రి యాగం బ్రహ్మోత్సవ పండితులు గురుజీ సంజీవ్‌కుమార్ సిద్దాంతి చేతుల మీదుగా విగ్రహాల ప్రతిష్ఠాపన చేశారు. కార్యక్రమాలలో గురుజీ ముత్తై సంజీవ్‌కుమార్ సిద్దాంతి గ్రామ పెద్దలు ఎట్టి రవీందర్, తోలేం వెంకన్న, తాటి నాగరాజు, ఆదివాసి కుల పెద్దలు పెద్దల కృష్ణ, జిగట నరేందర్, ఆక తిరుమల్‌రావు, బోదెబోయిన నరేందర్, పేరంటాలు వాసం ఈశ్వరమ్మ, ఎల్లబోయిన సుక్కమ్మ, ఎట్టి గణపతి పాల్గొన్నారు.


రాజలింగమూర్తి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే

భూపాలపల్లి కృష్ణకాలనీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల హత్యకు గురైన నాగవెల్లి రాజలింగమూర్తి కుటుంబ సభ్యులను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శనివారం పరామర్శించారు. రాజలింగమూర్తి చిత్రపటానికి పూలు చల్లి నివాళులు అర్పించారు. అధైర్య పడవద్దని భరోసానిచ్చి.. ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మృతుడి భార్య నాగవెల్లి సరళ తన ఆవేదనను ఎమ్మెల్యేకు వెలిబుచ్చారు. కాంగ్రెస్ నాయకులు గాజర్ల అశోక్, చల్లూరి మధు, జోగుల సమ్మయ్య, ఉడుత మహేందర్ ఉన్నారు.

రంజాన్ మాసంలో ఇబ్బందులు కలుగకుండా చూడాలి

భూపాలపల్లి కలెక్టరేట్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించిన కలెక్టర్ మార్చి 2వతేది నుంచి ప్రారంభంకానున్న రంజాన్ మాసం ఏర్పాట్లపై సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రంజాన్ మాసంలో ముస్లింలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రత్యేక ప్రార్థన మందిరాల్లో నిరంతర విద్యుత్‌ను సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మీ, మైనార్టీ అధికారి శైలజా తదితరులు పాల్గొన్నారు.

పనులను అడ్డుకున్న నిర్వాసితులు



పనులను అడ్డుకుంటున్న నిర్వాసితులు

మల్హర్, మార్చి 1(ఆంధ్రజ్యోతి) : జెన్‌కో భూ ఉపరితల బొగ్గు గనుల తవ్వకాల్లో బాగంగా శనివారం రాత్రి పనులను పెద్ద తాడిచర్లలోని ఎస్సీ కాలనీ లోని నిర్వాసితులు అడ్డుకున్నారు. డంపుయార్డు ఏర్పాటుకు భూమి చదును చేస్తున్న సమయంలో నిర్వాసితులు అక్కడికి చేరుకొని పనులను అడ్డుకున్నారు. దీంతో చేసేది లేక ఓసీ అధికారులు వెనుదిగిరి వెళ్లారు. ఇప్పటికే ఓసీపీ వల్ల దుమ్ము గ్రామంలోకి చేరి తినే ఆహార పదార్థాలు కలుషితం అవుతున్నాయని, బ్లాస్టింగ్ వల్ల ఇండ్లు బీటలు బారుతున్న ఎవరూ పట్టించుకోవడం లేదని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు.

కొంప ముంచిన మొక్కజొన్న

(5వ పేజీ తరువాయి)

పరిహారం చెల్లింపు విషయంలో సదరు కంపెనీ ప్రతినిధుల నుంచి స్పష్టమైన సమాధానం లేకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. రైతు, ప్రజాసంఘాలు కంపెనీల తీరుపై ఘాటుగా స్పందిస్తున్నాయి.

- సర్వే చేస్తున్న వ్యవసాయ శాఖ

మొక్కజొన్న సాగులో ఎదురైన నష్టంపై జిల్లా కలెక్టర్ దివాకర స్పందించారు. వ్యవసాయ శాఖ అధికారులను సర్వేకు ఆదేశించారు. జిల్లా వ్యవసాయాధికారి సురేష్ పర్యవేక్షణలో ఏడు బృందాలుగా విడిపోయిన అధికారులు క్షేత్రస్థాయిలో రైతుల వివరాలను సేకరిస్తున్నారు. ఇప్పటివరకు 414మంది రైతులకు చెందిన 838ఎకరాలలో నష్టం జరిగినట్లు గుర్తించారు. మరో రెండు రోజులు సర్వే కొనసాగుతుందని, నష్టపోయిన రైతులు స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని డీఏవో సూచించారు. ఈ నెల 5న జిల్లా కలెక్టర్‌కు సమగ్ర నివేదికను సమర్పించడం జరుగుతుందని తెలిపారు.